సదా మీ సేవలో..
ఆంధ్రజ్యోతి
మీ సమస్యలు తెలపండి
9985411157
ప్రకటనల కోసం
9989784942
ఆంధ్రజ్యోతి కాపీ కోసం
9908854251

## 7న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

కదిరి అర్బన్, ఆగస్టు 31( ఆన్‌లైన్): అఖిల భారత ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 7వ తేదీన జరిగే దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. అధిక ధరలను నియంత్రించాలని, కార్మిక చట్టాలను సరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ అవకాశాలు కల్పించి వాటికి భద్రత కల్పించాలని , ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులను ఉపసంహరించాలనే డిమాండ్లతో సమ్మెను తలపెట్టినట్లు నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి జె. రాజారెడ్డి, వేమయ్య యాదవ్, జింకా వెంకటరమణ, భాస్కర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

కదిరి జోన్
ఆంధ్రజ్యోతి
బుధవారం 01-09-2010




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పూల నరసింహులు

# అవినీతిపై బహిరంగ విచారణకు సిద్ధమా!

### కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల సవాల్

కదిరి, ఆగస్టు 31(ఆన్‌లైన్) :మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు మేం సిద్ధం. బహిరంగ విచారణకు మీరు కూడా సిద్ధమేనా అని తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు కె.దిల్‌దార్‌అలీ, చాంద్‌బాషా, రాజశేఖరాచారి పాలక పక్షానికి సవాల్ విసిరారు. మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగంలో లక్షలాది రూపాయలు నిధులు దుర్వినియోగం అవుతున్న కథనాలు పత్రికల్లో రావడంతో ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిజాంవలీ కౌన్సిల్ హాలులో చైర్మన్ కె.వి. రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. మొదట మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు పత్రికల్లో వచ్చాయని వాటిపైన అధికారులు వివరణ ఇవ్వాలని కౌన్సిలర్ ముజఫర్‌అలీ అధికారులను డిమాండ్ చేశారు.

కౌన్సిల్ స భ్యులు అడిగిన ప్రశ్నలకు తూ.. తూ మంత్రంగా సమాధానం చెప్పడం సరికాదని , అక్రమాలకు సంబంధించిన వివరాలను స్పష్టంగా వివరించాలని టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. వెంటనే చైర్మన్ అక్రమాలకు సంబంధించిన రికార్డులను తెప్పించారు. ఉచిత తాగునీటి ట్యాంకర్ల ద్వారా తక్కువ ట్రిప్పులు తోలి ఎక్కువ బిల్లులు చేసుకోవడం, చెత్తాచెదారాన్ని కూడా తక్కువ తోలి ఎక్కువ డీజిల్ ఖర్చు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసుకోవడంపై బహిరంగ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ల ఇళ్ల ముందే కాలువలు సరిగా శుభ్రం చే యనప్పుడు సామాన్య ప్రజల ఇళ్ల వద్ద ప రి స్థితి ఏ విధంగా ఉంటుందో అధికారు లు తెలుసుకోవాలని కౌన్సిలర్ పర్వీన్‌భానూ పేర్కొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రామచంద్రారెడ్డి, అవినీతిపై ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

అయ్యప్ప స్వామి గుడి సమీపంలో బీఆర్‌జీఎఫ్ నిధులతో పనులు నాసిరకంగా చేయడంతో ఇళ్లలోకి మురుగునీరు వస్తున్నాయని కౌన్సిలర్ సతీష్ చైర్మన్ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ అద్దె గదులను అద్దెకు ఇచ్చేందుకు వేలం వేస్తున్నట్లు ప్రకటించకుండానే ఎలా వేస్తారంటూ కౌన్సిలర్ కుళ్లాయప్ప ధ్వజమెత్తారు. ఇందిరమ్మ కాలనీల్లో సౌకర్యాలు ఏమాత్రం లేవని, సౌకర్యాలు కల్పించడం చేతకాకపోతే మాతో కాదని తేల్చి చెప్పాలని కౌన్సిలర్ రాజశేఖరరెడ్డి అధికారులను నిలదీశారు. తమ వార్డులో ఇంత వరకు పైపులైన్ వేయక పోవడంతో ప్రజలు తాగునీటితో ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ శ్రీనివాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో ప్రైవేటు వ్యక్తికి చోటు కల్పిస్తే కొద్ది రోజులు పోయాక స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తాడని వైస్ చైర్మన్ బయప్ప పేర్కొన్నారు. పార్నపల్లి తాగునీటి పథకం అధ్వాన్నంగా ఉందని కౌన్సిలర్లందరూ ఈ తాగునీటి పథకంపై దృష్టి సారించి ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించడానికి కృషి చేయాలన్నారు. కౌన్సిల్ సభ్యుల ప్రశ్నలకు చైర్మన్ రామచంద్రారెడ్డి , కమిషనర్ కృష్ణమోహన్‌లు సమాధానమిచ్చారు. సమావేశంలో ఎంఈ నారాయణ, ఏఈ షకూర్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

### పత్రికల్లో వచ్చేవి ముమ్మాటికీ నిజం కాదు- కమిషనర్

మున్సిపల్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని దినపత్రికల్లో వచ్చే కథనాలు ముమ్మాటికీ నిజం కాద ని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. వివిధ దినపత్రికల్లో వచ్చిన అవినీతి కథనాలపై వివరణ ఇవ్వాలని కొందరు కౌన్సిలర్లు కమిషనర్‌ను కౌన్సిల్ సమావేశంలో కోరారు. స్పందించిన కమిషనర్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. పత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతి ఒక్క అంశం నిజమే అనుకుంటే పొరపాటే అన్నారు. మున్సిపల్ సిబ్బంది సక్రమంగా పని చేయాలని అందరికీ ఆదేశాలు ఇచ్చామని, డీజిల్ ఎంత అవసరమో ఆ మేరకే వాడతామని వివరణ ఇచ్చారు.

## 'పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు'

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 31(ఆన్ లైన్) : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం విషయంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్తలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పూల నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పిట్టా ఓబుళరెడ్డి అధ్యక్షతన పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ ఆరోగ్య కార్యకర్తలకు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ,ఈఓఆర్‌డీ శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుధ్యంపై నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో కమిటీ సభ్యులందరూ విధిగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వచ్చిన నిధులతో సర్పంచ్‌లు, ఆరోగ్య కార్యకర్తలు పారిశుధ్యానికి ఖర్చు చేయాలని ఎంపీహెచ్‌ఈఓ రామాంజనేయులు పేర్కొన్నారు. పైపులు పగిలిన చోట మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శేషయ్య వివరించారు.

## ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం ధర్నా

తలుపుల, ఆగస్టు 31(ఆన్‌లైన్) : ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సీఐటీయు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు కదిరి డివిజన్ సీఐటీయు కార్యదర్శి నరసింహులు అధ్యక్షతన జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి, తదితర ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశిల్దార్‌కు అందచేశారు. కార్యక్రమంలో తలుపుల గ్రామ పంచాయతీ వర్కర్లు, కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయు నాయకులు ఆదినారాయణ, సత్యలక్ష్మి పాల్గొన్నారు.

## కదిరిలో యువ జేఏసీ ఏర్పాటు

కదిరి అర్బన్, ఆగస్టు 31(ఆన్‌లైన్) : పట్టణంలో మంగళవారం యువ జేఏసీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రకటించారు. అధ్యక్షుడుగా వెంకటేష్, గౌరవాధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఖాసీంవలీ, కార్యదర్శులుగా గంగాధర్, ఇంతియాజ్, మహమ్మద్ అక్మల్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, రఘు, బాషా ఖాన్, సూర్యనారాయణాచారి, రవికుమార్, కోశాధికారి వెంకటేష్, ప్రచార కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేంద్ర, గంగులప్ప ఎన్నుకున్నారు.

## ప్రజా ఆరోగ్యాలపై దృష్టి సారించాలి : ఎంపీహెచ్‌ఈఓ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 31(ఆన్‌లైన్) : ఆశా కార్యకర్తలు విధిగా ప్రజల ఆరోగ్య విషయాల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తమై సహకారాలు అందించాల్సిన అవసరం ఉందని ఎంపీహెచ్‌ఈఓ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో ఆశడే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్‌ఈఓ, పీహెచ్‌ఎన్ నాగమ్మ మాట్లాడుతూ ఆరోగ్య విషయాల్లోనే కాకుండా కుటుంబ నియంత్రణ, టీకాలు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశ కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవమ్మ, వెంకటలక్ష్మి, బీపీరెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### హలో ఆన్‌లైన్

గాంధీనగర్‌లో డ్రైనేజీ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. శుభ్రం చేయండి.

**జయరాం, గాంధీనగర్**

వెంటనే కాలువను శుభ్రం చేయిస్తాం.

**కృష్ణమోహన్, కమిషనర్**

అమీన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అయినా బిల్లులు మంజూరు కాలేదు. మంజూరు చేయించండి.

**షఫీ, అమీన్‌నగర్**

గృహాలను పరిశీలించి బిల్లులను పంపిణీ చేయడానికి కృషి చేస్తాం.

**చెన్నారెడ్డి, హౌసింగ్ ఏఈ**

భగీరథపల్లిలో విద్యుత్‌లైట్లు పడలేదు. చీకటిగా ఉంది. సమస్య తీర్చండి?

**శంకర, భగీరథపల్లి**

రెండు రోజుల్లోగా గ్రామంలో పర్యటించి విద్యుత్ బల్బులను వేయిస్తాం.

**విష్ణుప్రసాద్, ఎంపీడీఏ**

## పాదయాత్రకు ఘన స్వాగతం

తలుపుల, ఆగస్టు 31(ఆన్‌లైన్) : హిందూపురం నుంచి ఇడుపుల పాయ వరకు హిందూపురం యూత్ కాంగ్రెస్ నాయకులు చేలూరి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్యకర్తలు కాలినడకన బయలుదేరి వెళ్లారు. మంగళవారం పాదయాత్ర తలుపులకు చేరుకుంది. వారికి తలుపుల సర్పంచ్ బి.ఎస్. సూర్యనారాయణరెడ్డి, ఆర్ఎంపీ వైద్యుడు ఫయాజ్ అహమ్మద్, కాంగ్రెస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. వైఎస్ రాశేఖర రెడ్డి ప్రజల కోసం 1600 కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు. తాము ఈనెల 27వతేదీన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. సెప్టెంబరు 2వ తేదీ నాటికి ఇడుపుల పాయకు చేరుకుని అక్కడ వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులు లఅర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లేపాక్షి ఎంపీటీసీ అంజనరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, బసప్ప, రాజశేఖర రెడ్డి పాల్గొన్నారు.



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

## ఆశ కార్యకర్తలు సక్రమంగా పనిచేయాలి

తనకల్లు, ఆగస్టు 31(ఆన్‌లైన్) : ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో సక్రమంగా పని చేయండి. సత్వర సేవలు ప్రజలకు అందించండి.. అంటూ సీహెచ్‌ఎన్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ మునెప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ అండ్ న్యూట్రిషన్ క్లస్టర్‌లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లకు సమావేశం జరిగింది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం, మాతా శిశు సంక్షేమం, ఆరోగ్యం, తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. గత ఏడాది సత్వర సేవలు అందించడంతో పాటు ప్రగతి సాధించిన రవిశంకర్, జయరాజ్, సునీత, సుగుణలను డాక్టర్లు అభినందించారు.

## మన గాండ్లపెంట మండలం

### సమీక్ష

(ఆన్‌లైన్, గాండ్లపెంట)

*బుధవారం వీఆర్ఓ కుటుంబాన్ని కది రి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి బత్తల వెంకటరమణ పరామర్శించారు.

* గురువారం మండలానికి చెందిన న్యాయవాది ఫైజుల్లా వక్ఫ్‌బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా ఎంపికయ్యారు.

* శుక్రవారం ప్రగతి మహిళా సమాఖ్య మండల ఆనిమేటర్ల సంఘం కార్యవర్గం ఎన్నికైంది.ఎమ్మార్సీలో ఎంఈఓ తిరుపాల్‌నాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది.

* శనివారం శ్రావణమాసం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

* సోమవారం గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించనున్నట్లు తహశిల్దార్ నల్లప్ప వివరించారు. విద్యాసంస్థలు బంద్ చేశారు.

* మంగళవారం వైఎస్ విగ్రహం ఏర్పాట్లను డాక్టర్ బత్తల వెంకటరమణ పరిశీలించారు.



గ్రీవెన్స్‌డేలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్‌ఫోటో)